# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 149 క్రిష్ణా, సోమవారం 23- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ఏపీలో భారత్‌నెట్ విస్తరణకు

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 22:** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవలను విస్తరించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక ముందడుగు వేశాయి. అమెండెడ్ భారత్‌నెట్ ప్రాజెక్ట్ ను రాష్ట్రంలో సమర్థంగా అమలు చేసేందుకు ఇరు ప్రభుత్వాల మధ్య ఒక ముఖ్యమైన సహకార ఒప్పందం కుదిరింది. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ప్రాజెక్టు కింద రాష్ట్రానికి రూ. 2,432 కోట్ల నిధులను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సుమారు 5 లక్షల కుటుంబాలకు ఫైబర్ కనెక్షన్ల ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందించడం. దీని అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ ను ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను డిజిటల్ భారత్ నిధి, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా సమకూర్చనున్నాయి. కేంద్రం తరపున డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13,426 గ్రామ పంచాయతీల్లో నెట్‌వర్క్‌ను విస్తరించనున్నారు. ఇందులో భాగంగా, ఇప్పటికే ఫేజ్–× కింద ఉన్న 1,692 పంచాయతీల్లోని నెట్‌వర్క్‌ను ఆధునీకరిస్తారు. అలాగే, ఫేజ్–×× కింద 11,254 గ్రామాల్లో డిజిటల్ కనెక్టివిటీ పనులను పూర్తి చేస్తారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కూడా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించనున్నారు. వీటికి అదనంగా, స్థానిక అవసరాలు, డిమాండ్‌ను బట్టి 3,942 గ్రామాల్లో లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రాజెక్టు సజావుగా సాగేందుకు అవసరమైన రైట్ ఆఫ్ వే అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, క్షేత్రస్థాయిలో సమన్వయం వంటి బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుంది. గ్రామాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈ–గవర్నెన్స్ సేవలు మరింత పటిష్టంగా ప్రజలకు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఒప్పందం గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ విప్లవానికి బాటలు వేస్తుందని, సమ్మిళిత అభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.


# గ్రామీణ డాక్ సేవకుల సేవలు అమూల్యం అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటన

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 22:** టెక్నాలజీ ఎంత అభివృద్ధి సాధించినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి అందుబాటులోకి వచ్చినా, గ్రామీణ ప్రాంతాల్లో మానవతా స్పర్శతో సేవలు అందించే గ్రామీణ డాక్ సేవకులకు ప్రత్యామ్నాయం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో వారి పాత్ర అత్యంత కీలకమని, వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం నాడు గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్‌లతో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, పాత రోజులను గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, ఇతర సమాచారం కోసం ప్రతి ఒక్కరూ పోస్ట్‌మ్యాన్‌పైనే ఆధారపడేవారని, బ్యాంకులు లేని రోజుల్లో ఆర్థిక లావాదేవీలకు కూడా ఇండియా పోస్టే కీలక మాధ్యమంగా ఉండేదని తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కూడా సమరయోధుల మధ్య సమాచారాన్ని చేరవేసి పరోక్షంగా కీలక పాత్ర పోషించిన వారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించిన ఉన్నత విద్యావంతుడని, రాజవంశంలో పుట్టినా అత్యంత పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని కొనియాడారు. సింధియా నాయనమ్మ, గ్వాలియర్ రాజమాత విజయరాజే సింధియాతో తనకు మంచి అనుబంధం ఉందని, ఆమె ఎన్టీ రామారావుగారికి అత్యంత సన్నిహితురాలని గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా, సింధియా తండ్రి మాధవరావు సింధియాతో కూడా కలిసి పనిచేశానని, ఆయన నిరాడంబరత, నిజాయతీ గొప్పవని అన్నారు. సింధియా పూర్వీకుల గ్రామమైన 'సింధియా' విశాఖపట్నం గాజువాక సమీపంలో ఉండటం ఆనందంగా ఉందని, వారి కుటుంబానికి ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న ఈ అనుబంధం గొప్పదని పేర్కొన్నారు. మరో కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిని ప్రశంసిస్తూ, ఒక వైద్యుడిగా, ఐటీ నిపుణుడిగా అమెరికాలో అపారమైన సంపద సృష్టించి, ఇప్పుడు పార్లమెంటులో అత్యంత సంపన్న ఎంపీగా ప్రజాసేవకు ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు. వీరిద్దరి వంటి సమర్థవంతమైన నాయకులు కేంద్రంలో ఉండటం దేశానికి గర్వకారణమని చంద్రబాబు అభివర్ణించారు. భవిష్యత్తులో గ్రామీణ డాక్ సేవకుల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని




చంద్రబాబు నొక్కిచెప్పారు. వారి పనిభారాన్ని తగ్గించి, ఉత్పాదకతను పెంచేందుకు వీలుగా రాష్ట్రంలోని 17,000 మంది గ్రామీణ డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లను అందించాలని కేంద్ర మంత్రి సింధియాను కోరారు. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఒక 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్'గా పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల కాలుష్యరహిత ప్రయాణంతో పాటు, శ్రమ తగ్గి గ్రామీణ ప్రాంతాల్లో మరింత వేగంగా సేవలు అందించగలరని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవలను కూడా గ్రామీణ డాక్ సేవకుల ద్వారా ప్రజలకు చేరవేస్తామని, ఇందుకు అవసరమైన సమన్వయం చేసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉండటంతో అభివృద్ధి సూపర్ స్పీడ్‌తో ముందుకు సాగుతోందని చంద్రబాబు తెలిపారు. 20 నెలల సుపరిపాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికామని అన్నారు. ఒకప్పుడు స్మశానం, ఎడారి అన్న అమరావతిని దేవతల రాజధానిగా, ప్రపంచం మెచ్చే ప్రజా రాజధానిగా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడి, లాభాల బాట పట్టించామని, ఈ నెలలోనే రూ.54 కోట్ల లాభం వచ్చిందని వెల్లడించారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని, ఈ 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో గ్రామీణ డాక్ సేవకులే వెన్నెముకగా నిలుస్తారని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వారిపైఉందని సూచించారు.

# జమ్మూకశ్మీర్‌లో ముగ్గురు ఉగ్రవాదుల హతం



**క్రైం కౌంటర్ న్యూస్,** శ్రీనగర్, ఫిబ్రవరి 22: జమ్మూకశ్మీర్‌లోని కిస్త్వాడ్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు మరణించారు. వారు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ (జేఈఎం) తరఫున పనిచేస్తున్నారని భద్రతాబలగాలు గుర్తించాయి. మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన మట్టి ఇంట్లో ఉగ్రవాదులు ఉన్నారన్న కచ్చితంగా సమాచారం అందుకున్న భద్రతాబలగాలు ఆపరేషన్ ట్రాషి–ఐ పేరుతో అత్యంత సాహసంతో గాలింపు చేపట్టాయి. తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరపగా, జవాన్లు కూడా ఎదురుకాల్పులు జరిపి వారిని మట్టుబెట్టారు. మృతి చెందిన వారిలో కరుడుగట్టిన ఉగ్రవాది, జేఈఎం కమాండర్ సైఫుల్లా ఉన్నట్టు అనుమానిస్తున్నారు.




## ఏపీలో భారత్ నెట్ అమలు కోసం కేంద్రంతో


# కీలక ఒప్పందం..

**క్రైం కౌంటర్ న్యూస్,** అమరావతి, ఫిబ్రవరి 22 గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక సహకార ఒప్పందం కుదిరింది. సుమారు 5 లక్షల గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లకు ఫైబర్ కనెక్షన్లు అందించే లక్ష్యంతో అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్ అమలు చేయనుంది. ఏపీలో ఏబీపీ అమలుకు రూ. 2,432 కోట్ల మేర నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఏబీపీ కోసం ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో ఎస్పీవీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. డిజిటల్ భారత్ నిధి – రాష్ట్ర ప్రభుత్వం పరస్పర అంగీకారంతో నిధులు సమకూర్చి ప్రాజెక్టు అమలు చేసేలా చర్యలు చేపట్టింది.

సీఎం చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో డిజిటల్ భారత్ నిధి – ఏపీ ప్రభుత్వం మధ్య ఎంఓయూ కుదిరింది. పై డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ఐ అండ్ ఐ శాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు సంతకాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ ఇన్‌ఫ్రా బలోపేతం, గ్రామ పంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందించేలా సహకార ఒప్పందం చేసుకుంది. రైట్ ఆఫ్ వే అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, క్షేత్ర స్థాయి సమన్వయానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించనుంది.

ఏపీ వ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీలలో ప్రాజెక్టు అమలు చేసేలా ప్రణాళికలు చేసింది. 1,692 ఫేజ్–× పంచాయతీల్లోని నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేయడం, 11,254 ఫేజ్–××లోని గ్రామాల డిజిటల్ కనెక్టివిటీని పూర్తి చేయడం.. ఇక కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కనెక్టివిటీ ఇచ్చేలా చర్యలు చేపట్టింది. 3942 గ్రామాల్లో డిమాండ్ ఆధారంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంచే అంశంపై ఏపీ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. డిజిటల్ కనెక్టివిటీ ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈ–గవర్నెన్స్ వంటి సేవలను మరింత బలోపేతం చేసేలా ఏపీ సర్కార్ ప్రణాళికలను రూపొందించింది.

# గ్రాండ్ సక్సెస్ దిశగా ఆపరేషన్ కగార్



**క్రైం కౌంటర్ న్యూస్,** హైదరాబాద్, ఫిబ్రవరి 22 : దేశంలో మావోయిస్టు ఉద్యమం అంతమైనట్లేనా? కేంద్రప్రభుత్వం విధించిన గడువు కంటే ముందే ఆపరేషన్ కగార్ విజయవంత మవుతోందా? అంటే అవుననే అంటున్నాయి పోలీసు వర్గాలు. కొన్ని దశాబ్దాలుగా జనతన సర్కార్ లాంటి సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టు పార్టీ ఇక ఉనికి కోల్పోయినట్లేనని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. మావోయిస్టు రహిత దేశం లక్ష్యంగా కేంద్రప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌కు ఈ ఏడాది మార్చి 31వ తేదీని డెడ్‌లైన్‌గా నిర్ణయించిన విషయం తెలిసిందే. మావోయిస్టు రహిత దేశం లక్ష్యంలో చివరి దశకు చేరుకున్నామని ఇటీవలే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. ఈ నెల మొదటి వారంలో రాయ్‌పూర్‌లో కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు, నిఘా విభాగాల ఉన్నతాధికారులతో ఆయన సమావేశమై అడవుల్లో మిగిలిన మావోయిస్టుల ఏరివేత విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఆ తర్వాతఛత్తీసగఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ, ఒడిశా పోలీసులు మరో సంయుక్త ఆపరేషన్ ప్రారంభించి,

2లో

# గ్రాండ్ సక్సెస్ దిశగా ఆపరేషన్ కగార్

నిఘా సమాచారాన్ని పంచుకుంటూ కీలక మావోయిస్టు నేత లోకేటిచందర్‌తో పాటు నలుగురిని ఎన్‌కౌంటర్ చేశారు. ఆ తర్వాత దేవ్‌జీ లక్ష్యంగా కర్రెగుట్టలపై కేంద్ర బలగాలను మోహరించి ఒత్తిడి పెంచారు. వాస్తవానికి 2019 నుంచి మావోయిస్టు పార్టీని టార్గెట్ చేసిన కేంద్రం.. పెద్ద ఎత్తున్న సీఆర్‌పీఎఫ్ దళాలను మోహరించి ప్రత్యేక ఆపరేషన్లు చేపట్టింది. సీఆర్‌పీఎ?ఫలోని కోబ్రా దళాలు మావోయిస్టుల అడ్డాల్లో బేస్‌క్యాంపులు ఏర్పాటు చేసుకుని వేట కొనసాగించాయి. మొదటి దశలో 24 బేస్‌క్యాంపులను ఏర్పాటు చేసుకుని మావోయిస్టుల కదలికలకు చెక్ పెట్టారు. 2020లో బేస్‌క్యాంపుల సంఖ్యను 40కి పెంచారు. ప్రస్తుతం వ్యూహాత్మక ప్రాంతాల్లో 400 బేస్‌క్యాంపులు ఏర్పాటు చేసుకోవడం భద్రతా బలగాలు సాధించిన విజయంగా చెప్పవచ్చు. ఒక్కో క్యాంపులో 200-400 మంది సాయుధ పోలీసులు ఉంటారు. వీరి వద్ద అత్యాధునిక ఆయుధాలు ఉంటాయి. నైట్ విజన్ పరికరాలు, డ్రోన్లు వాడుతూ రాత్రివేళల్లో కూడా మావోయిస్టుల కదలికలను కట్టడి చేశారు. 2019 నాటికి తెలంగాణ, ఏపీ, ఛత్తీసగఢ్, బిహార్, మహారాష్ట్ర, ఒడిశా తదితర పది రాష్ట్రాల్లోని 61 జిల్లాల్లో మావోయిస్టు పార్టీ కార్యకలాపాలు జోరుగా సాగుతుండేవి. ప్రస్తుతం వారు పది జిల్లాలకే పరిమితమయ్యారు.

## ఎన్నికలకు వెళ్తే ప్రజలు ఛీ కొడతారన్నా మాజీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం..

ఎన్టీఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం,



**ఫిబ్రవరి 22,(క్రైం కౌంటర్ డెస్క్):**సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ప్రజలకు ఏమి చెప్పి అధికారంలోకి వచ్చారు ఇప్పుడు ఏమి చేస్తున్నారనీ ప్రశ్నించారు మాజీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం. ఇటీవల కొంత మంది దొండగుల దాడిలో దెబ్బతిన్నా జోగి రమేష్ ఇంటిని పరిశీలన చేశారు. అనంతరం జోగి కుటుంబానికి ఆయన ధైర్యం చెప్పారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో ప్రభుత్వాలను చూశాను గానీ ఇలాంటి ప్రభుత్వాలను చూడలేదుఅన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తున్న నాయకులపై దాడి చేయడం ఎప్పుడూ చూడలేదన్నారు. బలహీనవర్గాలపై చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. బలహీనవర్గాలలో పుట్టాం కానీ తాము బలహీనులు కాదనే విషయాన్ని కుటమి ప్రభుత్వ నాయకులు తెలుసుకోవాలని ఆయన సూచించారు. కుటమి నాయకులు ఇప్పుడు ఎన్నికలకు వెళ్తే ప్రజలు ఛీ కొడతారని ఆయన స్పష్టం చేశారు. మాజీ మంత్రి జోగి రమేష్ పైనే పోలీసుల సమక్షంలో దాడులు చేస్తుంటే.. సామాన్య ప్రజలకు ఏమి భరోసా ఇస్తారని ఈ సందర్భంగా ప్రశ్నించారు తమ్మినేని సీతారాం. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేసుకోవాలి కానీ, డైవర్ట్ రాజకీయాలు చేయడం కోసం ఇటువంటి దాడులు చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జోగి రమేష్, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు కలిసి పరామర్శించారు.

# నేటి నుంచే ఇంటర్ పరీక్షలు

**34 కేంద్రాలు, 26,301 మంది విద్యార్థులు**
**నిర్ణీత తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష**
**అర్ధ గంట ముందు నుంచే కేంద్రాల్లోకి ప్రవేశం**
**ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ**



**క్రైం కౌంటర్ న్యూస్,** అనకాపల్లి, ఫిబ్రవరి 22 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 34 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వేర్వేరుగా మార్చి 24వ తేదీ వరకు నిర్ణీత తేదీల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులను 30 నిమిషాల ముందు నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. సరిగ్గా తొమ్మిది గంటలకు గేట్లు మూసేస్తారు. ఒక్క నిమిషం ఆలస్యం అయినా లోపలికి అనుమతించరు. ఈ ఏడాది జిల్లాలో ప్రథమ, ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 26,301 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 13,153 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 13,148 మంది వున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు. కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రతి గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ష?ట్రనిక్ పరికరాలను వెంట తీసుకురాకూడదు.

# కృత్రిమ మేధ వినియోగంలో ఏఐ సదస్సు టర్నింగ్ పాయింట్




**క్రైం కౌంటర్ న్యూస్,** న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: భవిష్యత్తులో కృత్రిమ మేధ(ఏఐ)ను ప్రపంచం ఎలా ఉపయోగించనుందనే విషయంలో భారతదేశం నిర్వహించిన ఏఐ ఇంపాక్ట్ సదస్సు ఒక టర్నింగ్ పాయింట్‌గా నిరూపణ అయ్యిందని ప్రధాని మోదీ తెలిపారు. మన ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆకట్టుకున్నాయన్నారు. ప్రతినెలా చివరి ఆదివారం రేడియో ద్వారా నిర్వహించే మన్‌కీ బాత్ కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. సదస్సులో ప్రత్యేకించి రెండు ఆవిష్కరణలు ఎక్కువగా ఆకట్టుకున్నాయని చెప్పారు. వాటిలో ఒకటి అమూల్ కేంద్రం కాగా, మరొకటి భారత సంస్కృతి పరిరక్షణకు సంబంధించినదని తెలిపారు. జంతువుల చికిత్సలో కృత్రిమ మేధ ఎలా ఉపయోగపడుతోందో, తమ పశువులు ఎక్కడున్నాయో 24/7 ఏఐ అసిస్టెంట్ సాయంతో రైతులు ఎలా కనుగొంటున్నారనే విషయాలను అమూల్ బూత్‌లో చక్కగా వివరించారని మోదీ ప్రశంసించారు. అలాగే, నేటి తరానికి అందుబాటులో ఉండేలా భారత పురాతన గ్రంథాలు, పరిజ్ఞానం, రాతప్రతులను పరిరక్షించడంలో కృత్రిమ మేధ ఎలా ఉపయోగపడుతోందో చూసి ప్రపంచ నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు. భారత్‌లో తయారైన మూడు ఏఐ మోడళ్లను కూడా సదస్సులో ఆవిష్కరించామని పేర్కొన్నారు. మరోవైపు, టీ-20 ప్రపంచ కప్ క్రికెట్‌లో భారత సంతతికి చెందిన ఆటగాళ్లు అనేక దేశాల తరఫున ఆడుతుండటం సంతోషకరమని మోదీ పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా మానసిక బానిసత్వం నుంచి కూడా స్వాతంత్ర్యం పొందడం అవసరమని మోదీ అన్నారు. ఇందులో భాగంగానే బానిసత్వ చిహ్నాలను దేశం త్యజిస్తోందన్నారు. ఆ దిశగా రాష్ట్రపతిభవన్ కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. రాష్ట్రపతిభవన్‌లోని బ్రిటిష్ ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లుటియెన్స్ విగ్రహాన్ని తొలగించి, ఆ స్థానంలో స్వతంత్ర భారత మొట్టమొదటి గవర్నర్ జనరల్ రాజగోపాలాచారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా బ్రిటిష్ పాలకుల విగ్రహాలు రాష్ట్రపతిభవన్‌లో ఉండటం దురదృష్టకరమన్నారు. కాగా, కేరళకు చెందిన 10నెలల చిన్నారి ఆలిన్ షెరిన్ అవయవదానంతో నలుగురికి కొత్త జీవితాన్ని ప్రసాదించడాన్ని మోదీ ప్రశంసించారు.

# షుగర్ ఫ్యాక్టరీలు మూతపడడంతో ఇతర పంటలపైపు మళ్లుతున్న రైతులు

**పుష్కర కాలం క్రితం 82 వేల ఎకరాల్లో చెరకు సాగు**
**గత ఏడాది 12 వేల ఎకరాలే!**
**వచ్చే సీజన్‌కు గోవాడ షుగర్స్ తెరవడంపై అనుమానాలు**
**ఫ్యాక్టరీ పరిధిలోని రైతుల్లో సందిగ్ధం**
**ప్రత్యామ్నాయంగా సరుగుడు, ఆయిల్ పామ్, కొబ్బరి సాగుకు మొగ్గు**



**క్రైం కౌంటర్ న్యూస్,** చోడవరం, ఫిబ్రవరి 22 : జిల్లాలోని సహకార చక్కెర కర్మాగారాలు ఒక్కొక్కటిగా మూతపడుతుండడంతో వీటి ప్రభావం చెరకు సాగుపై పడుతున్నది. ఇప్పటికే తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ పంచదార మిల్లుల పరిధిలో చెరకు సాగు చేసే రైతుల్లో ఎక్కువ మంది ఇతర పంటలవైపు మళ్లారు. ఇప్పుడు గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో కూడా క్రషింగ్ జరగకపోవడంతో చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో పలువురు రైతులు చెరకు సాగుకు స్వస్తపలికారు. వాస్తవంగా ఐదారేళ్ల క్రితం నుంచే చెరకు సాగు విస్తీర్ణం క్రమేపీ తగ్గుతూ వస్తున్నది. ఆయా భూముల్లో రైతులు సరుగుడు, ఆయిల్‌పామ్ తోటలు, ఇతర వ్యవసాయ పంటలు పండిస్తున్నారు.జిల్లాలో ఒకప్పుడు వరి తరువాత అత్యధిక విస్తీర్ణంలో చెరకు పంట సాగయ్యేది. అప్పట్లో జిల్లాలో నాలుగు సహకార చక్కెర ఫ్యాక్టరీలు వుండేవి. చెరకుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర గిట్టుబాటు కాకపోవడం, షుగర్ ఫ్యాక్టరీలు చెరకు డబ్బులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం, సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం వంటి కారణాలతో రైతులు చెరకు సాగును వదిలేసి ఇతర పంటవైపు మళ్లుతున్నారు. ఈ క్రమంలో 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అనకాపల్లి మండలం తుమ్మపాల షుగర్స్‌ను మూసేసింది. మూడేళ్ల తరువాత ఎలమంచిలి మండలం ఏటికొప్పాక, పాయకరావుపేట మండలం తాండవ ఫ్యాక్టరీలకు తాళాలు వేసింది. దీంతో ఈ మూడు ఫ్యాక్టరీల పరిధిలో చెరకు సాగు గణనీయంగా తగ్గిపోయింది. ఇక మిగిలిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణకు నోచుకోకపోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా చెరకు సరఫరా చేసిన రైతులకు, ఫ్యాక్టరీ కార్మికులకు సకాలంలో డబ్బులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్న నాటి వైసీపీ పాలకులు, నేటి కూటమి నేతల మాటలు నీటి మూటలుగా మారాయి. సుమారు 12 ఏళ్ల క్రితం జిల్లాలో 82 వేల ఎకరాల్లో చెరకు సాగు కాగా, గత ఏడాది 12 వేల ఎకరాలకు పడిపోయింది. ఇందులో సుమారు ఏడు వేల ఎకరాలు గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోనే వుంది. ఒకప్పుడు ఏటా ఐదు లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేసిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ.. 2024-25 సీజన్‌లో 70 వేల టన్నులకు పడిపోయింది. దీంతో రైతులు, కార్మికులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రస్తుత సీజన్‌లో చెరకు క్రషింగ్ చేయలేమంటూ గోవాడ ఫ్యాక్టరీ యాజమాన్యం చెతులెత్తేసింది. వచ్చే సీజన్‌లో ఫ్యాక్టరీ నడుస్తుందా? లేదా? అన్నది సందిగ్ధంగా మారింది. దీంతో రానున్న ఖరీఫ్‌లో ఈ ఫ్యాక్టరీ పరిధిలో ఎంతమంది రైతులు చెరకు సాగు చేస్తారన్నది ప్రశ్నార్థకమే! వాస్తవంగా పదేళ్ల క్రితం గోవాడ ఫ్యాక్టరీ పరిధిలో సుమారు 30 వేల ఎకరాల్లో చెరకు సాగయ్యేది. గోవాడ ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు డబ్బులు చెల్లింపుల్లో జాప్యం చేయడం, కేంద్రం ప్రకటించే మద్దతు ధర గిట్టుబాటు కాకపోవడంతో ఐదారేళ్ల నుంచే ఫ్యాక్టరీ పరిధిలో చెరకు సాగు తగ్గుతూ వస్తున్నది. గత సీజన్‌లో ఇది ఏడు వేల ఎకరాలకు పడిపోయింది. చెరకు సాగు చేసిన పొలాల్లో రైతులు సరుగుడు, ఆయిల్‌పామ్, కొబ్బరి వంటి తోటలు వేస్తున్నారు. నీటి సదుపాయం వున్న భూముల్లో వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఒకప్పుడు చెరకు సాగు చేసిన పొలాల్లో ఇప్పుడు సరుగుడు తోటలు కనిపిస్తున్నాయి. బెల్లం తయారుచేసే రైతులు మినహా మిగిలిన వారెవరూ చెరకు సాగు చేసే పరిస్థితి లేదు.

# ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ తీరు సిగ్గుచేటు

**దేశాభివృద్ధిని అడ్డుకోవడమే ఆ పార్టీ ధ్యేయం**
**తల్లీపిల్ల కాంగ్రెస్‌తో ప్రజలకు నష్టం**
**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**
**కాంగ్రెస్‌ది దిగజారుడుతనం**
**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**
**జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కూటమి నేతల నిరసన**




**క్రైం కౌంటర్ న్యూస్,** సిరిపురం, ఫిబ్రవరి 22 దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాల కోసం తాపత్రయపడుతున్న కాంగ్రెస్ పార్టీ దేశాభివృద్ధికి అడ్డుపడుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు అన్నారు. ఢిల్లీలో జరిగిన ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ వ్యవహరించిన తీరుకు వ్యతిరేకంగా ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కూటమి నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ లాంటి దుష్టశక్తులను ఎదుర్కొనేందుకు సమష్టిగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ దేశాల్లోని దిగ్గజ సంస్థల పెద్దలు పాల్గొన్న ఏఐ సిమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ వ్యవహరించిన తీరు సిగ్గు చేటన్నారు. నిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, కానీ దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా ఏఐ సమ్మిట్‌లో చొక్కాలు విప్పి అర్ధనగ్న ప్రదర్శన చేయడం దారుణమన్నారు. ప్రధాని మంత్రి నరేంద్రమోదీని దెబ్బతీశామని అనుకుంటే పొరపాటని, ఇది భారతీయుల ఏఐపై ప్రపంచ వ్యాప్తంగా చర్చసాగుతోందని, దీనికి మన దేశమే రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. విశాఖ పట్నం ఏఐకు కేరాఫ్ అడ్రస్‌గా మారబోతుందన్నారు. మోదీ నాయకత్వంలో దేశానికి వచ్చే పెట్టుబడులను అడ్డుకోవడమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందన్నారు. దేశంలో తల్లి కాంగ్రెస్, రాష్ట్రంలో పిల్ల కాంగ్రెస్ కలిసి ఆడుతున్న నాటకమని, దీనిని ప్రజలంతా గమనించాలన్నారు. భావి తరాలకు భవిష్యత్తు లేకుండా చేయాలనే కాంగ్రెస్ పార్టీ చర్యలను తిప్పికొడతామన్నారు. దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఐక్యంగా ముందుకు వెళ్తున్నాయన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ దేశ ప్రతిష్టను దెబ్బ తీసేలా కాంగ్రెస్ పార్టీ దిగుజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. గూగుల్ సెంటర్‌తో విశాఖపట్నం ప్రపంచంలో గ్లోబల్ హబ్‌గా మారుబోతుందని సుందర్ పిచాయ్ సమ్మిట్‌లో ప్రస్తావించారని, అది మనకు గర్వకారణమన్నారు. కాంగ్రెస్ పార్టీ నీచరాజకీయాలు దేశాభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయన్నారు. ఏఐతో జరగనున్న కొత్త ఆవిష్కరణలను కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందన్నారు. ప్రజలకు నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తున్న ఆ పార్టీ చర్యలను తిప్పికొడతామని నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు పట్టాభి, ఎన్టీఆర్ ఆరోగ్య ట్రస్టు చైర్మన్ సీతంరాజు సుధాకర్, జనసేన నాయకులు శివ ప్రసాద్, బీజేపీ నాయకులు దామోదర్ యాదయ్, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. తొలుత మహాత్మాగాంధీ విగ్రహానికి పల్లా శ్రీనివాసరావు, మాధవ్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

# టీడీపీకి కార్యకర్తలే శ్రీరామరక్ష




క్రైం కౌంటర్ న్యూస్, పర్చూరు(పర్చూరు), ఫిబ్రవరి 22 : తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే శ్రీరామరక్ష అని అలాంటి నిజాయితీ నిబద్ధత కలిగిన కార్యకర్తలు తెలుగుదేశం పార్టీకి సొంతమని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం తలపెట్టిన బాపట్ల పార్లమెంట్ మరియు నియోజకవర్గ నూతన కార్యాలయ భవన నిర్మాణ శంకుస్థాపన, నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి పర్చూరు నియోజవర్గంలోని ఆయా మండలాల నుండి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలి వెళ్ళారు. భూమి పూజ అనంతరం వేలాది మంది కార్యకర్తల సమక్షంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ పార్టీ కార్యాలయం ప్రతి కార్యకర్తకు దేవాలయం లాంటిది అన్నారు. అధికారం ఉన్నా లేకున్నా తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు.

బాపట్లకు తరలిన టీడీపీ శ్రేణులు మార్టూరు : బాపట్లలో టీడీపీ కార్యాలయ భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి ఆదివారం మార్టూరు, యద్దనపూడి మండలాల నుంచి పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మండల స్థాయి నాయకులు వాహనాలలో తరలివెళ్లారు. మార్టూరు గ్రామంలో తొండెపు ఆదినారాయణ, గుర్రం శ్రీను, సూర్య నాయక్, తిమ్మయ్య, అడకా లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిట్టి, బూదయ్య, తదితరులు వాహనాలలో తరలివెళ్లారు. అదేవిధంగా టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గా ప్రమాణ స్వీకారం చేయడానికి బయలుదేరిన కాకోలు వెంకటేశ్వర్లు వెంట కన్నెగంటి శ్రీనివాసరావు, జాష్టి సాంబశివరావు, కొర్రపాటి కాజారావు, మాదాల సాంబశివరావు, గన్నవరం బుడే, చెరుకూరి నాగేశ్వరరావు, చెన్నుపాటి బసవ రాములు, గొట్టిపాటి వెంకట్రావు తదితర పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. అదేవిధంగా యద్దనపూడి మండలం నుండి నల్లపనేని రంగయ్య చౌదరి, గుదే తారకరామారావు, వజ్జా సుబ్బరామయ్య, బోయపాటి సాంబయ్య, కోయ సతీష్, దూళ్లిపాళ్ల వెంకటస్వామి, కనపర్తి నాగేశ్వరరావు తదితరులు నాయకులు తరలివెళ్లారు. చినగంజాం : బాపట్లలో జరిగే జిల్లా టీడీపీ కార్యాలయ భూమిపూజ, జిల్లా టీడీపీ నాయకుల ప్రమాణ స్వీకారోత్సవానికి మండల పరిధిలోని టీడీపీ శ్రేణులు ఆదివారం భారీగా బాపట్ల తరలి వెళ్లారు. మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన నక్కల రాఘవరావు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, చినగంజాం గ్రామానికి చెందిన సయ్యద్ అబ్దుల్ కలాం అజాద్ జిల్లా టీడీపీ అధికార ప్రతిని?ధిగా బాపట్లలో ప్రమాణ స్వీకారం చేసేందుకు మండల పరిదిలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి వెళ్లారు. ఆయా గ్రామాల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు వాహనాలల్లో భారీ సంఖ్యలో వెళ్లారు.

# ఆరోగ్యశాఖలో ఫేక్ నియామక ఉత్తర్వుల హల్‌చల్

**పూర్వపు డీఎంహెచ్‌వోల పేర్లతో జారీ**

**- ప్రస్తుత అధికారి పేరుతోనూ కొందరికి ఆర్డర్లు**

**- మోసపోయిన పలువురు అభ్యర్థులు**

**- డీఎంహెచ్‌వో కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు**

**- పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులిపేసుకుంటున్న అధికారులు**

**- చెలరేగిపోతున్న అక్రమార్కులు**



క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం, ఫిబ్రవరి 22 వైద్య, ఆరోగ్యశాఖలో నకిలీ నియామక ఉత్తర్వులు హల్‌చల్ చేస్తున్నాయి. పోస్టుల భర్తీ లేకుండానే కొంతమందిని నమ్మించి రూ.లక్షలు దోచేసి, పూర్వ అధికారుల పేరుతో దర్జాగా ఉత్తర్వులు ఇచ్చేస్తున్నారు. ఉద్యోగం వచ్చిందనే ఆనందంలో వాటిని తీసుకుని ఆయా కార్యాలయాలకు వెళ్లిన అభ్యర్థులు అవి ఫేక్ అని తెలియడంతో మోసపోయామని గుర్తించి, డీఎంహెచ్‌వో కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఇలాంటి అక్రమాలు వెలుగుచూసిన సందర్భంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అధికారులు ఆ తరువాత పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.అమాయక అభ్యర్థులకు ఫేక్ ఉత్తర్వులు జారీచేసిన ఉదంతాలు గతంలో అనేకం వెలుగులోకి వచ్చాయి. వీటిపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన ఆరోగ్యశాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. ఏజెన్సీలోని ఆరోగ్య కేంద్రం క్రిటికల్ కేర్ విభాగంలో స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఇద్దరికి నియామక ఉత్తర్వులు అందాయి. దీంతో ఆస్పత్రికి వెళ్లిన అభ్యర్థులకు దిమ్మతిరిగే షాక్ తగిలింది. నియామక ఉత్తర్వులు పరిశీలించిన అక్కడి అధికారులు ఈ తరహా పోస్టులు లేవని, ఉత్తర్వుల్లో సంతకం ఉన్న ఆరోగ్యశాఖ అధికారి ప్రస్తుతం ఇక్కడ లేరని చెప్పడంతో వారు కంగుతిన్నారు. వెంటనే విశాఖ ఆరోగ్యశాఖ కార్యాలయానికి వచ్చి తమకు జరిగిన మోసాన్ని చెప్పి లబోదిబోమన్నారు. దీనిపై అప్పట్లో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది జరిగిన కొద్ది నెలలకే మరో కేసు వెలుగులోకి వచ్చింది. అనకాపల్లి జిల్లాలోని ఓ ఆరోగ్య కేంద్రంలో రెండు కేటగిరీలకు చెందిన ఉద్యోగాల పేరుతో ఇద్దరికి నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఆస్పత్రికి వెళ్లిన వారికి ఇదే తరహా అనుభవం ఎదురయింది. నియామక ఉత్తర్వులు ఫేక్ అని, ఖాళీలను భర్తీచేసేందుకు నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని చెప్పడంతో వారు ఆరోగ్యశాఖ కార్యాలయానికి వచ్చారు. దీంతో మళ్లీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు సందర్భాల్లో గతంలో పనిచేసిన ఆరోగ్య శాఖ అధికారుల పేర్లతోనే ఉత్తర్వులు ఇచ్చారు. ఆ తరు వాత కొద్ది నెలలకు కేజీహెచ్‌లోనూ ఉ ద్యోగాలు కల్పించినట్టు ఇద్దరికి నకిలీ నియామక ఉత్తర్వులను అందించారు. విధుల్లో చేరేందుకు వెళ్లిన వారిని సిబ్బంది వాకబు చేయగా మోసపోయినట్టు గుర్తించారు. వెంటనే ఆరోగ్యశాఖ అధికారుల వద్దకు పంపించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరికి ఇచ్చిన నియామక ఉత్తర్వుల్లో ప్రస్తుత డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు పేరు ఉంది. కానీ మరికొన్ని సంతకాల్లో తప్పిదాలున్నాయి. కేజీహెచ్ డీఎంఈ కంట్రోల్ ఆస్పత్రి. ఇక్కడ జరిగే నియామకాలకు ఆరోగ్యశాఖ అధికా రితో సంబంధం ఉండదు. కానీ మోసగాళు ఇవేమీ పట్టించుకోకుండా ఉత్తర్వులు తయారుచేసి ఇచ్చేస్తున్నారు. వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులుఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల పేర్లతో నకిలీ నియామక ఉత్తర్వులు వెలుగులోకి వస్తున్నప్పటికీ అధికారులు పట్టనట్టు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సదరు అభ్యర్థులు వచ్చినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేయడం, ఆ తరువాత విస్మరించడంతో మోసగాళ్లు రెచ్చిపోతూనే ఉన్నారు. పోస్టుల భర్తీ చేపట్టిన ప్రతిసారీ మోసగాళ్లు చెలరేగిపోతున్నారు. అడ్డగోలు వ్యవహారాలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసి మోసగాళ్లకు శిక్ష పడేలా చేయడంతోపాటు బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇలా మోసపోయిన కొందరు ఇప్పటికీ ఆరోగ్యశాఖ అధికారులు చుట్టూ తిరుగుతున్నారు.

ఫార్మాసిస్టు పోస్టుల భర్తీకి కసరత్తు వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న 12 ఫార్మాసిస్టు పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పోస్టులకు జోన్-1 పరిధిలో 583 మందికి దరఖాస్తు చేయగా, వాటిని ప్రస్తుతం పరిశీలిస్తున్నారు. ఈ నెలాఖరుకు ప్రొవిజినల్ మెరిట్ జాబితా సిద్ధమవుతుందని,ఆ తరువాత అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితాను విడుదలచేస్తామని అధికారులు తెలిపారు. దీనిపై ఆర్డీ డాక్టర్ రాధారాణి మాట్లాడుతూ నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, దళారులను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు.

# సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ వేటును మరోసారి పొడిగింపు



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 22: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్ అధికారి, సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ వేటును మరోసారి పొడిగించింది. ఆయనపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణ ముగిసే వరకు లేదా ఆయన పదవీ విరమణ చేసే తేదీ వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని స్పష్టం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1993 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సునీల్ కుమార్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ అడిషనల్ డీజీగా, ఆ తర్వాత సీఐడీ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో, అప్పటి నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలపై గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆయనపై క్రిమినల్ కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు ఏసీబీ కోర్టులో విచారణ దశలో ఉంది.ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో సునీల్ కుమార్‌ను తిరిగి సర్వీసులోకి తీసుకుంటే సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని, దర్యాప్తు పారదర్శకంగా సాగేందుకు సస్పెన్షన్ పొడిగింపు తప్పనిసరి అని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటితో పాటు, ప్రభుత్వ అనుమతి లేకుండా 2020 నుంచి 2024 మధ్య పలుమార్లు విదేశాలకు వెళ్లడం, అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణలపై కూడా ఆయన ఏసీబీ విచారణను ఎదుర్కొంటున్నారు.ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్, 1969లోని రూల్ 3(3) ప్రకారం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సునీల్ కుమార్ పదవీ విరమణ తేదీ 2026 జూన్ 30 కావడంతో అప్పటివరకు కేసుల విచారణ పూర్తికాకపోతే ఆయన సర్వీసులో చేరకుండానే రిటైర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ముహూర్తం ఖరారు

**8వ తేదీన నూకాంబిక నూతన ఆలయం ప్రారంభం**

**ఉదయం 10.58 గంటలకు రాజగోపురంపై పసిడి కలశ ప్రతిష్ఠ**

**మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అమ్మవారి మూలవిరాట్ దర్శనం**

**ఐదో తేదీ నుంచే పలు కార్యక్రమాలు**

**ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వెల్లడి**



క్రైం కౌంటర్ న్యూస్, అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 22 స్థానిక నూకాంబిక అమ్మవారి దేవాలయం పునర్నిర్మాణ పనులు పూర్తయినందున మార్చి ఎనిమిదో తేదీ ఉదయం 10.58 గంటలకు ప్రారంభించాలని ముహూర్తం నిర్ణయించినట్టు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆలయ మండపంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022లో మొదలైన ఆలయ పునర్నిర్మాణ పనులు ఇప్పటికి పూర్తయ్యాయని చెప్పారు. మొత్తం రూ.12.5 కోట్లు వ్యయమైందని, పీలా గోవింద సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే సుమారు రూ.2.5 కోట్లతో రాజగోపురం నిర్మాణమైందన్నారు. అమ్మవారి నూతన ఆలయం ప్రారంభం సందర్భంగా ఐదో తేదీ నుంచే పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తొలి రోజున అమ్మవారికి పసిడి కలశాల ఊరేగింపు, ఆరో తేదీన వివిధ పూజా కార్యక్రమాలు, ఏడో తేదీన విగ్రహ వాస్తు పూజ, హోమాలు ఉంటాయన్నారు. ఎనిమిదవ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు వేదపారాయణం, విఘ్నేశ్వర పూజ, అనంతరం 10.58 గంటలకు దేవాలయం రాజగోపురంపై పసిడి కలశ ప్రతిష్ఠ, పూర్ణాహుతి జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి నూతన ఆలయంలో భక్తులకు అమ్మవారి మూలవిరాట్ దర్శనం కల్పించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా మంత్రి అనిత, ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, దేవదాయ శాఖ కమిషనర్, తదితర ప్రముఖులను ఆహ్వానించినట్లు కొణతాల తెలిపారు. పదో తేదీన కొత్త అమావాస్య జాతర ప్రారంభమవుతుందని, జాతర పూర్తయ్యే వరకు నెల రోజులపాటు నిత్యం పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మీడియా సమావేశంలో ఆలయ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో ఎల్.శ్రీధర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

## లడ్డూ వివాదంలో ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని భూమన ఆరోపణ



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 22: తిరుపతి లడ్డూ వివాదంలో తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని, దారి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతోందని వైసీపీ విమర్శించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాలను, తిరుమల తిరుపతి దేవస్థానం అవకతవకలను ఎండగట్టడంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది.ఆదివారం నాడు వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. లడ్డూ అంశంపై ఏకసభ్య కమిటీని నియమించడం సుప్రీంకోర్టును అవమానించడమేనని అన్నారు.లడ్డూ తయారీకి వాడే నెయ్యిలో జంతు కొవ్వు లేదని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే సీబీఐ సిట్ బృందం స్పష్టంగా నివేదిక ఇచ్చింది. ఇప్పుడు ఆ నివేదికను ప్రశ్నించేలా కమిటీ వేయడం సర్వోన్నత న్యాయస్థానం గౌరవాన్ని సవాలు చేయడమే అని ఆయన పేర్కొన్నారు.లడ్డూపై చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా చేసిన తప్పుడు ప్రచారాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఈ కమిటీని ఏర్పాటు చేశారని భూమన ఆరోపించారు. సిట్ నివేదికతో వారి వాదనలు తప్పని తేలడంతో ముఖం చాటేసేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కమిటీ చట్టపరంగా నిలబడదని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కుంభకోణానికి మూలమైన హెరిటేజ్, ఇందాపూర్, భోలే బాబా డెయిరీల మధ్య ఉన్న సంబంధాలను మేం బయటపెడుతూనే ఉంటాం అని కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు, పరకామణి చోరీ కేసులో కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, రాజకీయ ప్రత్యర్థులను ఇరికించేందుకు టీటీడీ ప్రయత్నిస్తోందని, ఇది కూడా ప్రజల దృష్టిని మళ్లించే కుట్రలో భాగమేనని ఆయన ఆరోపించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలకు భయపడబోమని, న్యాయపోరాటం చేస్తామని భూమన తేల్చి చెప్పారు.

# సినిమా



## ఫిట్‌నెస్ విషయంలో తగ్గేదేలే..

పైన ఫోటోలో తలక్రిందుగా వేలాడుతూ కనిపిస్తున్నదెవరో గుర్తు పట్టారా? అతను ఇప్పుడు సౌత్ సినిమా ఇండస్ట్రీలో ఫేమస్ హీరో. యాక్షన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్. మాస్ హీరోగా అభిమానుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. పేరుకు తమిళ నటుడు అయినప్పటికీ తెలుగులోనూ ఈ స్టార్ హీరోకు చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. చాలా మంది లాగే ఇతను కూడా చైల్డ్ ఆర్టిస్టు గా సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టాడు. ఆ తర్వాత హీరోగానూ ఎంట్రీ ఇచ్చాడు. సూపర్ హిట్ సినిమాలతో స్టార్ హీరోగా మారిపోయాడు. అయితే ఆ మధ్యన కొన్ని అనారోగ్య సమస్యల బారిన పడ్డాడీ ట్యాలెంటెడ్ హీరో. దీంతో అభిమానులు తీవ్ర ఆందోళన చెందారు. అయితే కొన్ని రోజుల్లోనే మళ్లీ తేరుకోవడంతో ఫ్యాన్స్ చాలా హ్యాపీగా ఫీలయ్యారు. ఇక గత కొన్ని రోజులుగా ఫిట్ నెట్ పై బాగా దృష్టి సారించాడీ హీరో. క్రమం తప్పకుండా జిమ్ కు వెళుతున్నాడు. కఠినమైన వర్కవుట్లు, వ్యాయామాలు చేస్తున్నాడు. అంతేకాదు ఆ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నాడు. అలా తాజాగా జిమ్ లో తలకిందులుగా వేలాడుతూ కనిపించాడీ హీరో. మరి అతనెవరో గుర్తు పట్టారా?
కోలీవుడ్ మాస్ హీరో విశాల్ ఆ మధ్యన తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడిన సంగతి తెలిసిందే.,డెంగ్యూ బారిన పడడంతో బాగా బక్కచిక్కిపోయి కనిపించాడు. ట్రీట్మెంట్ తీసుకుని వెంటనే కోలుకోవడంతో ఫ్యాన్స్ సంబరపడ్డారు. ఈక్రమంలో ఫిట్ నెస్ పై మరింత దృష్టి పెట్టు విశాల్. ట్రైనర్, కాబోయే భార్య సాయి ధన్సిక సహకారంతో జిమ్ లో గంటల తరబడి గడుపుతున్నాడు. ఈ క్రమంలో విశాల్తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన జిమ్ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ సందర్భంగా ట్రైనర్, సాయి ధన్సికకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపాడీ హీరో.ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం విశాల్ తన 36వ చిత్రంలో బిజీగా ఉన్నారు. సుందర్ సి దర్శకత్వంలో 'మొగుడు' అనే సినిమా షూటింగ్ లో పాల్గొంటున్నాడు విశాల్.ఈ సినిమాలో విశాల్ సరసన మిల్కీ బ్యూటీ తమన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా, యోగి బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. గతంలో విశాల్- సుందర్ సి కాంబినేషన్ లో వచ్చిన యాక్షన్, మగ మహారాజు సినిమాలు సూపర్ హిట్ అయ్యాయి. ఈ సినిమాల తరహాలోనే 'మొగుడు' మూవీ కూడా పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందని తెలుస్తోంది.





## ఈ లడ్డూ రోజుకి ఒకటి తిన్నారంటే..

కండరాల బలోపేతానికి, నొప్పుల నివారణకు రాగులు చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి. భారతదేశంలో చాలా సులభంగా లభించే ఈ ధాన్యం మన ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. వీటిని జనాలు అనేక రకాలు తమ ఆహారంలో చేర్చుకుంటూ ఉంటారు. కొందరు ఈ రాగులతో రొట్టెలు చేసుకుంటే, మరికొందరు జావాలా చేసుకొని తాగుతారు. మరికొందరు రాగి ముద్దలు చేసుకొని తింటారు.కొందరు ఇడ్లీల్లా తింటారు. అయితే తరచూ చేసుకోవడానికి ఇబ్బందిగా ఉన్న వారు. ఈ రాగులతో లడ్డూలు చేసుకొని వాటిని నిల్వ చేసుకొని తినడం ఉత్తమమైన ఎంపిక.

రాగి లడ్డూ ప్రయోజనాలు

రాగి లడ్డు చాలా ఆరోగ్యకరమైన స్నాక్. దీన్ని క్రమం తప్పకుండా తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. రాగిలో కాల్షియం, ఐరన్, ప్రోటీన్, ఫైబర్, యాంటీఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉంటాయి. వీటిలో బెల్లం కడపడం ద్వారా సహజ తీపి, మరిన్ని ప్రయోజనాలు పెరుగుతాయి. రోజుకు 1-2 లడ్డూలు తినడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. ఎముకలు, దంతాలు బలపడతాయి, రక్తహీనత తగ్గుతుంది, మధుమేహం నియంత్రణలో ఉంటుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే గుండె ఆరోగ్యం, చర్మం, జుట్టు ఆరోగ్యం మెరుగవుతాయి.

రాగి లడ్డూ తయారీకి కావాల్సిన పదార్థాలు.

ఈ రాగి లడ్డూను తయారు చేసుకోవడానికి మీరు పెద్దగా శ్రమించాల్సిన అవసరం లేదు. దీనికి పెద్దగా సమాగ్రి కూడా అవసరం లేదు. 1 కప్పు జొన్న (సన్నగా రుబ్బినది), 1 కప్పు బెల్లం , 1/4 కప్పు నెయ్యి 1 , టేబుల్ స్పూన్ ఏలకుల పొడి, డ్రై ఫ్రూట్స్, వేరుశెనగలు, బాదం, కాజు 2-3 టేబుల్ స్పూన్లు, ఎండు కొబ్బరి 2-3 టేబుల్ స్పూన్లు ఉంటే సరిపోతుంది.

రాగి లడ్డూ తయారీ విదానం

ఒక మందపాటి పాన్‌లో 2 టేబుల్ స్పూన్ల నెయ్యి వేడి చేసి, రాగి పిండి వేసి చిన్న మంట మీద నెమ్మదిగా వేయించండి. దాన్ని నిరంతరం కలుపుతూ ఉండండి. మంచి వాసన వచ్చి, రంగు కొద్దిగా మారినప్పుడు ఆపేయండి. దీన్ని ఒక ప్లేట్‌లోకి తీసి చల్లారనివ్వండి. తర్వాత అదే పాన్‌లో కొద్దిగా నెయ్యిలో వేరుశెనగలు, బాదం, కాజు ముక్కలు వేసి లైట్‌గా వేగనివ్వండి. ఎండు కొబ్బరి కూడా వేసి 1-2 నిమిషాలు వేయించి, చల్లారనివ్వండి.

తర్వాత బెల్లాన్ని చిన్న ముక్కలుగా చేసి మిక్సీలో పొడి చేసుకోండి. కొందరు బెల్లం సిరప్‌గా కరిగించి వాడతారు కానీ పొడి వాడితే సులభం ఇది ఎక్కువ రోజులు ఉంటుంది. తర్వాత ఒక పెద్ద గిన్నెలో వేయించిన రాగి పిండి, బెల్లం పొడి, ఏలకుల పొడి, వేయించిన డ్రై ఫ్రూట్స్ అన్నీ కలిపి బాగా మిక్స్ చేయండి. ఇప్పుడు మిగిలిన నెయ్యిని కొద్ది కొద్దిగా వేడి చేసి చేతితో బాగా కలపండి. తర్వాత ఆ మిశ్రమాన్ని చేతితో లడ్డూలా తయారు చేయండి. దీన్ని మీ పిల్లలకు ప్రతిరోజూ ఇస్తే వారి ఆరోగ్యం బాగుంటుంది. వారికి దంతాలు లేదా కీళ్ల నొప్పులు కూడా ఉండవు. రాగి ఉత్పత్తులు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటాయి.



## వైట్ లేదా బ్రౌన్ రైస్.. త్వరగా బరువు తగ్గేందుకు ఏది బెస్ట్!

బ్రౌన్ రైస్ అనేది ఒక తృణధాన్యం. దీన్ని ఎక్కువగా పాలిష్ చేయరు కాబట్టి ఇందులో దీనిలో ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. కాని వైట్ రైస్ విషయానికి వస్తే దీన్ని ఎక్కువగా ప్రాసెస్ చేస్తారు. కాబట్టి వీటిపై ఉన్న పొరలన్ని తొలగిపోతాయి. ఇది బియ్యాన్ని మృదువుగా, చెడిపోకుండా నిరోధించేలా చేస్తుంది, కానీ పాలిష్ చేసినప్పుడు బియ్యం పై భాగంలో ఉన్న ఫైబర్, ఇతర పోషకాలు తొలగిపోతాయి. బ్రౌన్ రైస్‌లో చాలా తక్కువ కేలరీలు ఉంటాయని ప్రజలు తరచుగా అనుకుంటారు, కానీ అది నిజం కాదు. ఒక గిన్నెడు వండిన బ్రౌన్ రైస్‌లో తెల్ల బియ్యంతో సమానమైన కేలరీలు ఉంటాయి. రెండింటి మధ్యలో తేడా ఏమిటంటే.. బ్రౌన్ రైస్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తుంది. దీని వల్ల మీకు త్వరగా ఆకలి వేయదు

బరువు తగ్గడానికి బ్రౌన్ రైస్ ఎలా సహాయపడుతుంది?

బ్రౌన్ రైస్ బరువు తగ్గడానికి అనేక విధాలుగా సహాయపడుతుంది. ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తుంది. అలాగే ఆకలి బాధలను నివారిస్తుంది. ఇది నెమ్మదిగా జీర్ణమవుతుంది, ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇంకా, బ్రౌన్ రైస్ రక్తంలో చక్కెరను నియంత్రణలో ఉంచుతుంది. రక్తంలో చక్కెర అకస్మాత్తుగా పెరిగి ఆపై తగ్గినప్పుడు, ఆకలి మొదలవుతుంది, కానీ బ్రౌన్ రైస్ నెమ్మదిగా శక్తిని అందిస్తుంది, ఇది ఆకస్మిక ఆకలి, కోరికలను తగ్గిస్తుంది. కానీ గుర్తుంచుకోండి, బ్రౌన్ రైస్ మాత్రమే తినడం వల్ల బరువు తగ్గదు. సరైన ఆహారం, వ్యాయామం కూడా చాలా అవసరం.

వైట్ రైస్ ఎప్పుడూ చెడ్డవి కాదు

వైట్ రైస్ తినడం వల్ల త్వరగా బరువు పెరుగుతామని చాలా మంది అనుకుంటారు. కానీ ఇది పూర్తిగా నిజం కాదు. తెల్ల బియ్యం సులభంగా జీర్ణమవుతుంది. అలాగే తక్షణ శక్తిని అందిస్తుంది. అనేక ఆసియా దేశాలలో, ప్రజలు ప్రతిరోజూ తెల్ల బియ్యం తింటారు. ఇప్పటికీ వారంతా ఆరోగ్యంగానే ఉంటారు. కారణం సరైన పరిమాణంలో, చురుకైన జీవనశైలి ఉంటే ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

## లంక ఆశలు ఆవిరి..

టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 పోరులో శ్రీలంక ఘోర పరాజయాన్ని చవిచూసింది. పల్లెకెలె వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో లంక జట్టు 51 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 147 పరుగుల సాదాసీదా లక్ష్యాన్ని ఛేదించలేక శ్రీలంక కేవలం 95 పరుగులకే కుప్పకూలింది. ఈ విజయంతో ఇంగ్లాండ్ గ్రూప్-2 పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోగా, లంక సెమీస్ ఆశలు సంక్లిష్టంగా మారాయి. 147 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే చుక్కలు కనిపించాయి. ఇంగ్లాండ్ బౌలర్ల ధాటికి లంక బ్యాటర్లు క్రీజులో నిలవలేకపోయారు. కేవలం పవర్‌ప్లే ముగిసే సమయానికే 34 పరుగులకు 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్ పతుమ్ నిస్సంక (9), కుసాల్ మెండిస్ (0), పవన్ రత్నాయకే (0) వెనువెంటనే అవుట్ కావడం జట్టును కోలుకోలేని దెబ్బ తీసింది. ఇంగ్లాండ్ బౌలర్లలో విల్ జాక్స్ 3 వికెట్లతో చెలరేగగా.. ఆర్చర్, డాసన్, ఆదిల్ రషీద్ తలో రెండు వికెట్లు తీసి లంక పతనాన్ని శాసించారు.

మధ్యలో కమిందు మెండిస్ (13), కెప్టెన్ దసున్ శనక కాసేపు పోరాడినా ఫలితం లేకుండా పోయింది. లంక బ్యాటర్లలో ఒక్కరు కూడా కనీసం 15 పరుగుల మార్కును దాటలేకపోయారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆఖర్లో చమీరాను లియామ్ డాసన్ క్లీన్ బౌల్డ్ చేయడంతో లంక ఇన్నింగ్స్ 95 పరుగుల వద్ద ముగిసింది. అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు బౌలింగ్‌లోనూ ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఇంగ్లాండ్, లంకను వారి సొంత గడ్డపైనే మట్టికరిపించింది.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (62) అద్భుతమైన హాఫ్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. లంక బౌలర్లలో దునిత్ వెల్లా లగే (3 వికెట్లు), మదుశంక (2 వికెట్లు) ఇంగ్లాండ్‌ను కట్టడి చేసినప్పటికీ, బ్యాటర్లు చేతులెత్తేయడంతో వారి శ్రమ వృథా అయింది. ఒక దశలో 146 పరుగులు తక్కువ స్కోరు అనిపించినా, లంక బ్యాటర్ల వైఫల్యం ఇంగ్లాండ్‌కు సునాయాస విజయాన్ని కట్టబెట్టింది.




## ఐపీఎల్ 2026లోనూ ఆడనున్న ఎంఎస్ ధోనీ

చెన్నై సూపర్ కింగ్స్  అభిమానులకు ఇది నిజంగా శుభవార్త. గత కొన్ని సీజన్లుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరదించుతూ లెజెండరీ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్ 2026లో కూడా ఆడతాడని ఫ్రాంచైజీ సీఈఓ కాశీ విశ్వనాథన్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో ధోనీ భవిష్యత్తుపై జరుగుతున్న ఊహాగానాలకు పూర్తిస్థాయిలో ఫుల్‌స్టాప్ పడింది.ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి సుమారు నెల రోజుల సమయం ఉన్న నేపథ్యంలో ధోనీ భవిష్యత్తుపై సీఈఓ స్పష్టత ఇచ్చారు. అతను ఆడతాడు, ఈ సీజన్ లో తప్పకుండా ఆడతాడు అంటూ విశ్వనాథన్ చేసిన వ్యాఖ్యలతో 'యెల్లో ఆర్మీ'లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి ధోనీ సీఎస్కేకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మధ్యలో రెండేళ్ల పాటు జట్టుపై నిషేధం విధించినప్పుడు మాత్రమే రైజింగ్ పుణె సూపర్ జెయింట్ తరఫున ఆడాడు.44 ఏళ్ల వయసులోనూ జట్టుకు మార్గదర్శకత్వం అందిస్తూ ఐదుసార్లు సీఎస్కేను ఛాంపియన్‌గా నిలబెట్టిన ఘనత ధోనీది. ఇటీవల కామెంటరీ గురించి మాట్లాడుతూ అది చాలా కష్టమైన పని అనిఆటగాళ్లను విమర్శించకుండా వ్యాఖ్యానం చేయడం సవాలుతో కూడుకున్నదని పేర్కొన్నాడు.2020లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటికీ, ఐపీఎల్‌లో ధోనీ ప్రభావం తగ్గలేదు. మార్చి చివరిలో మొదలుకానున్న ఐపీఎల్ 2026లో 'తలా'ను మరోసారి మైదానంలో చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com